ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 348 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 28 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం
# భారీగా తగ్గింపు

### పెట్రోల్‌పై రూ.13గా ఉన్న ఛార్జీలను రూ.3గా..
### డీజిల్‌పై రూ.10 ఉంటే ప్రస్తుతం సున్నాకు తగ్గించినట్లు కేంద్ర వెల్లడి




**న్యూఢిల్లీ, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా పెరుగుతున్న ఇంధన ధరల పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లీటరు పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని 13 రూపాయల నుంచి 3 రూపాయలకి తగ్గించింది. లీటరు డీజిల్‌పై 10 రూపాయలుగా ఉన్న సుంకాన్ని సున్నాకు తగ్గించింది. ఈ తగ్గింపు తక్షణమే అమలులోకి వస్తుందని కేంద్రం తెలిపింది. ఫిబ్రవరి 28న ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి అంతర్జాతీయ చమురు ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. ప్రపంచ ముడిచమురు సరఫరాలో దాదాపు 20 నుంచి 25 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్ కు 100 డాలర్ల

..మిగతా 2లో




## తెలంగాణలో సమృద్ధిగా
# పెట్రో నిల్వలు

### గణాంకాలు విడుదల చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో ఇంధన సరఫరాకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రభుత్వం తాజా నివేదికను విడుదల చేసింది. మార్చి 27నాటి అధికారిక గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు డిమాండ్ కంటే అత్యధికంగా అందుబాటులో ఉన్నాయని స్పష్ట మైంది. సాధారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజూ అవసర మయ్యే ఇంధన పరిమాణం కంటే మార్చి 26వ తేదీన జరిగిన సరఫరా దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది రవాణా రంగం, సామాన్య వినియోగదారులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. పెట్రోల్ వినియోగాన్ని పరిశీలిస్తే, రాష్ట్రంలో రోజువారీ సగటు సరఫరా 5,883 కిలో లీటర్లుగా ఉంటుంది. అయితే, మార్చి 26 నాటికి ఏకంగా 16,609 కిలో లీటర్ల పెట్రోల్‌ను సరఫరా

..మిగతా 2లో



## టీమిండియా
# స్ఫూర్తితో సాగుదాం

### యుద్ధం వేళ సీఎంలతో ప్రధాని భేటీ..
### రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళికలపై కీలక చర్చలు

**న్యూఢిల్లీ, మార్చి 27 (ప్రభాత ఉదయం)**


పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ మధ్య జరుగుతోన్న యుద్ధం ప్రభావం భారత్‌పై కూడా ఎక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షోభాన్ని ఎదుర్కొడానికి టీమిండియా స్ఫూర్తితో సాగుదామని వారికి పీఎం సూచించినట్టు తెలుస్తోంది. యుద్ధం కారణంగా దేశంలో చమురు, వంట గ్యాస్ కొరత లేకుండా కేంద్రం చర్యలు

..మిగతా 2లో

## భద్రాచలంలో వైభవంగా
# సీతారాముల కల్యాణోత్సవం



### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు
### అంగరంగవైభవంగా జానకీరాముల కల్యాణం
### కుటుంబసభ్యులతో కలిసి కల్యాణంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దంపతులు
### భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన సీఎం



**భద్రాద్రి, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

భద్రాద్రి రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సీతా సమేత శ్రీరామచంద్రుడి కల్యాణాన్ని మిథిలా మైదానంలో అభిజిత్ లగ్నంలో అట్టహాసంగా నిర్వహించారు. సీతమ్మ తల్లిని శ్రీరాముడు మనువాడే అద్భుత ఘడియల కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్న రామభక్తులు ఈ లోకకల్యాణాన్ని కనులారా తిలకించి తరించారు. సీతారాముల కల్యాణ వేడుకను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అర్చకుల వేదమంత్రాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య అభిజిత్ లగ్నంలో మాంగళ్యధారణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గీత దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు.

**రూ.351 కోట్లతో భూమిపూజ :** ఈ కల్యాణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధికి తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు.

**ప్రతి ఘట్టం ఆధ్యాత్మిక సాగరమే :** జగాలను ఏలిన జగదేకవీరుడికి జగన్మాత సీతమ్మకు అభిజిత్ లగ్నంలో జరిగిన కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. ఈ వైభవాన్ని కనులారా తిలకించి లోకమంతా పులకించిపోయింది. భద్రాచలం దివ్యక్షేత్రంలో భక్త కోటిని నయనానందకరం చేసింది. ఉదయం

..మిగతా 2లో



# పండుగపూట మరో ఘోరం

### ఒకే కుటుంబానికి చెందిన 8 మంది దుర్మరణం

**కౌశాంబి, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

శ్రీరామ నవమి పర్వదినాన ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కాన్పూర్-ప్రయాగ్‌రాజ్ హైవేపై జరిగిన భీకర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. డోర్మా పెట్రోల్ పంప్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఒక భారీ ట్రాలీని వేగంగా వచ్చిన పికప్ వ్యాన్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల సమాచారం ప్రకారం.. పికప్ వ్యాన్‌లో సుమారు 25 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరిలో మహిళలు, చిన్న పిల్లలు కూడా ఉన్నారు. ఫతేపూర్ జిల్లా మల్వా ప్రాంతంలోని బడోఖర్ గ్రామానికి చెందిన వీరందరూ శ్రీరామ నవమి

..మిగతా 2లో

## ఏప్రిల్ 25న
# కవిత కొత్త పార్టీ

### మేడ్చెల్ మునీరాబద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా
### శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా
### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన



**నిజామాబాద్, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి

..మిగతా 2లో




## కరీంనగర్ ఆర్బీఎల్ బ్యాంకులో
# భారీ కుంభకోణం

### చైనా వ్యక్తుల కోసం కరీంనగర్ ఆర్బీఎల్ బ్రాంచ్‌లో మ్యూల్ ఖాతాలు
### చేతులు మారిన రూ.137కోట్లు
### 7 మ్యూల్ ఖాతాల ద్వారా రూ.137 కోట్ల లావాదేవీలు జరిపినట్లు గుర్తింపు
### 8 కేసుల్లో 13 మంది నిందితులు అరెస్టు

2లో..

ప్రభాత ఉదయం

# భద్రాచలంలో వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

మొదటి పేజీ తరువాయి...



10.30 నుంచి 12.30 గంటల వరకు సాగిన కల్యాణ క్రతువులో ప్రతీ ఘట్టం ఆధ్యాత్మిక రస సాగరంలో ముంచెత్తింది. ప్రత్యేకంగా అలంకరించిన మిథిలా ప్రాంగణంలో తొలుత తిరు కల్యాణానికి సంకల్పం పలికి, సర్వ విఘ్నాన శాంతికి ఆరాధన చేపట్టారు.

వేద మంత్రోచ్చారణలు : కల్యాణానికి ఉపయోగించే సామగ్రిని సంప్రోక్షణ చేసిన తర్వాత రక్షా బంధనం నిర్వహించి యోకర్తధారణ చేశారు. ఇరు వంశాల గోత్రాలు పఠించి స్వామివారి పాద ప్రక్షాళన చేసి మహాదానాలు సమర్పించారు. వేద మంత్రోచ్చారణలు మార్మోగుతుండగా అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సుపై ఉంచారు. ఈ సమయాన్ని శుభ ముహూర్తమని జగత్ కల్యాణ శుభ సన్నివేశంగా కీర్తిస్తారు. రాముడి దోసిట తలంబ్రాలు నీలపు రాసులవుతుంటే జానకి దోసిట తలంబ్రాలు కెంపులయ్యాయి.

శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం : తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భద్రాచలం వచ్చిన భక్త జనానికి ఎలాంటి అసౌర్యం లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రత్యేకంగా సెక్టార్లు ఏర్పాట్లు చేసి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎండ నుంచి ఉపశమనం కలిగేలా చలువ పందిళ్లు వేశారు. భక్తుల తాకిడి పెరుగుతుండటం, ప్రముఖుల రాక ఎక్కువ ఉండటంతో దాదాపు 2 వేల మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాల్లో చివరి ఘట్టమైన శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం శనివారం జరగనుంది.

గోటి తలంబ్రాల అందజేత : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరి స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కల్యాణం అనంతరం ప్రముఖులకు వేద పండితులు స్వామివారి గోటి తలంబ్రాలు అందజేశారు.



# ఏప్రిల్ 25న కవిత కొత్త పార్టీ

మొదటి పేజీ తరువాయి...

మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గతకొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జుల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

# పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం భారీగా తగ్గింపు

మొదటి పేజీ తరువాయి...

మార్కును దాటింది. అయినప్పటికీ, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ రిటైల్ ధరలను పెంచకుండా స్థిరంగా ఉంచాయి. దీనివల్ల ఆయా సంస్థలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ కేంద్రం ఈ ప్రకటన చేసింది. ఈ నిర్ణయంతో రిటైల్ మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు తక్షణమే తగ్గే అవకాశం లేకపోయినా ఇంధన ధరల భారాన్ని చమురు కంపెనీలు ప్రజల పైకి బదిలీ చేయకుండా ఉపకరించనుంది.




**ఏవియేషన్ టర్బైన్ ఇంధనంకు మినహాయింపు**

డీజిల్ ఎగుమతులపై 'విండ్‌ఫాల్ ట్యాక్స్'ను లీటరుకు రూ. 21.5 గా నిర్ణయించింది. ఇదిలా ఉండగా, విమాన ఇంధనం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌పై ఇటీవల కేంద్రం స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీని తీసుకొచ్చింది. తాజాగా ప్రకటించిన మినహాయింపులతో ఇది లీటరుకు రూ. 29.5కు తగ్గింది.

**వదంతులు నమ్మవద్దు: కేంద్రం**

అలాగే, దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందనే వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ వార్తలను తోసిపుచ్చింది. దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా సాధారణంగానే జరుగుతుందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దేశంలోని అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయని, ముడిచమురు నిల్వలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పింది. గృహ అవసరాల కోసం ఎల్పీజీ ఉత్పత్తిని కూడా పెంచినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని వివరించింది.

అంతర్జాతీయంగా ముడిచమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు పెరిగినప్పటికీ, ఆ భారాన్ని కేంద్రం ప్రజలపై వేయడం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు 20శాతం నుంచి 50 శాతం వరకు పెరిగినా, భారత్‌లో మాత్రం ధరలు స్థిరంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఇదే విషయంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా స్పందించారు. సంక్షోభం నేపథ్యంలో వినియోగదారులను రక్షించడానికి పెట్రోల్, డీజిల్‌పై సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ. 10 చొప్పున తగ్గించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ప్రధాని మోదీని మంత్రులు కొనియాడారు.

ప్రస్తుతం దిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 94.77 రూపాయల ఉండగా, డీజిల్ ధర 87.67 రూపాయల వద్ద కొనసాగుతున్నాయి. వ్యాట్, ఇతరత్రా సుంకాలతో కలిసి వివిధ రాష్ట్రాల్లో ఈ ధరలు విభిన్నంగా ఉంటాయి. హైదరాబాద్‌లో రూ.107.46, కోల్‌కతాలో రూ. 103.54, ముంబయిలో రూ. 103.54, బెంగళూరులో రూ. 102.96గా ధరలు ఉన్నాయి



# పండుగపూట మరో ఘోరం

మొదటి పేజీ తరువాయి...

సందర్భంగా శీతలా ధామ్ దర్శనం కోసం పికప్ వ్యాన్ అద్దెకు తీసుకుని వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా మధ్యాహ్నం 3:45 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. ఢీకొన్న వేగానికి పికప్ వ్యాన్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. వాహనంలో ఉన్న ప్రయాణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ఆరోగ్య శాఖ సిబ్బంది నాలుగు అంబులెన్స్‌లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఎనిమిది మంది మృతి చెందారు. మిగిలిన క్షతగాత్రులకు ప్రస్తుతం స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం కారణంగా హైవేపై కొంతసేపు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# టీమిండియా స్ఫూర్తితో సాగుదాం



మొదటి పేజీ తరువాయి...

తీసుకుంటోంది. దేశీయంగా గ్యాస్ ఉత్పత్తిని పెంచినట్టు కేంద్రం తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధంతో నెలకున్న ఉద్రిక్తతలు, దేశంపై దాని ప్రభావం, పరిణామాలపై చర్చించేందుకు అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. సాయంత్రం 6.30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని వారితో మాట్లాడారు. ఈ సమావేశానికి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న పశ్చిమ్ బెంగాల్, తమిళనాడు, కేరళ సహా ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం దూరంగా ఉన్నారు. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, ఏ రేవంత్ రెడ్డి సహా మిగతా రాష్ట్రాల సీఎంలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళికలపై ప్రధాని చర్చలు జరిపారు. టీమిండియా స్ఫూర్తితో రాష్ట్రాలను సమన్వయం చేసుకునేలా జరిగిన ఈ భేటీకి హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా హాజరయ్యారు. పార్లమెంట్‌లో పశ్చిమాసియా యుద్ధ పరిణామాలు, చమురు, గ్యాస్ సంక్షోభం నివారణకు భారత్ తీసుకుంటున్న చర్యల గురించి ప్రధాని మోదీ ప్రసంగించిన సంగతి తెలిసిందే. పెరుగుతున్న ప్రపంచ ఉద్రిక్తతల దృష్ట్యా, ఇంధన సరఫరా, ద్రవ్యోల్బణం, లాజిస్టిక్స్ అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ పరిస్థితి వల్ల తలెత్తే ఏవైనా పరిణామాలను ఎదుర్కోవడానికి సంసిద్ధతను కూడా ఈ సమావేశంలో సమీక్షించారు.

## పెళ్లైన వ్యక్తి మరో మహిళతో సహజీవనం చేయడం
# నేరం కాదు

### అలహాబాద్ హైకోర్టు

**భార్యాభర్తల మధ్య అసహజ లైంగిక చర్యలు నేరం కాదన్న మధ్యప్రదేశ్ హైకోర్టు**

**న్యూఢిల్లీ, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

పెళ్లైన వ్యక్తి వయోజనురాలైన మహిళ అంగీకారంతో సహజీవనం చేయడం చట్టప్రకారం నేరం కాదని అలహాబాద్ హైకోర్టు తెలిపింది. వ్యక్తిగత హక్కులను పరిరక్షించాల్సిన కోర్టు విధిని సామాజిక నైతికత అధిగమించలేదని అభిప్రాయపడింది. మహిళ కుటుంబం నుంచి బెదిరింపులు ఎదుర్కొం టున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ సహజీవన జంట తమకు రక్షణ కల్పించాలని అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన అలహాబాద్ కోర్టు సహజీవనంపై కీలక వ్యాఖ్యలు చేసింది.

"వివాహితుడైన పురుషుడు వయోజనురాలైన మహిళతో ఆమె అంగీకారంతో సహజీవనం చేస్తున్నప్పుడు అతనిపై ఎలాంటి నేరం మోపడానికి ఆస్కారం లేదు. నైతికతను, చట్టాన్ని వేరుగా ఉంచాలి. చట్టప్రకారం ఎలాంటి నేరం జరగనప్పుడు పౌరుల హక్కులను పరిరక్షించే కోర్టు చర్యలకు సామాజిక అభిప్రాయాలు, నైతికత మార్గదర్శకం కావు. తాను ఇష్టపూర్వకంగా, స్వేచ్ఛతోనే ఆ వ్యక్తితో కలిసి జీవిస్తున్నానని ఆ మహిళ పోలీసు సూపరింటెండెంట్‌కు తెలియజేసింది. అయినప్పటికీ



మహిళ కుటుంబం నుంచి పరువు హత్య బెదిరింపులు ఉన్నా పోలీసులు చర్య తీసుకోలేదు. కలిసి జీవిస్తున్న ఇద్దరు వయోజనులను రక్షించడం పోలీసుల విధి. స్పష్టంగా ఈ ఫిర్యాదుపై పోలీసు సూపరింటెండెంట్ ఎటువంటి చర్య తీసుకోలేదు" అని జస్టిస్ జె.జె. మునీర్, జస్టిస్ తరుణ్ సక్సేనాలతో కూడిన అలహాబాద్ హైకోర్టు డివిజన్ బెంచ్ పేర్కొంది.

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ జంట (అనామిక, నేత్రపాల్) తమకు రక్షణ కల్పించాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అనామిక తన కుటుంబ సభ్యుల నుంచి తమకు ప్రాణహాని ఉందని పిటిషన్‌లో పేర్కొంది. పరువు హత్య చేస్తామని తమ వారు బెదిరిస్తున్నారని తెలిపింది. అయితే, మహిళ కుటుంబ సభ్యులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. నేత్రపాల్‌కు ఇప్పటికే పెళ్లి అయ్యిందని , అతను అనామికను పెళ్లి పేరుతో ఎత్తుకుపోయాడని ఆరోపించారు.

# కరీంనగర్ ఆర్బీఎల్ బ్యాంకులో భారీ కుంభకోణం

**చైనా వ్యక్తుల కోసం కరీంనగర్ ఆర్బీఎల్ బ్రాంచ్‌లో మ్యూల్ ఖాతాలు**

**చేతులు మారిన రూ.137కోట్లు**

**7 మ్యూల్ ఖాతాల ద్వారా రూ.137 కోట్ల లావాదేవీలు జరిపినట్లు గుర్తింపు**

**8 కేసుల్లో 13 మంది నిందితులు అరెస్టు**

**డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు నిందితులుగా ఉన్నారన్న పోలీసులు**

**హైదరాబాద్, మార్చి 27 (ప్రభాత ఉదయం)**




కరీంనగర్ ఆర్బీఎల్ బ్యాంకులో భారీ కుంభకోణం వెలుగుచూసింది. నకిలీ బ్యాంకు అకౌంట్లు తెరిచి మ్యూల్ ఖాతాల ద్వారా డబ్బులు మళ్లించినట్లుగా పోలీసులు గుర్తించారు. సైబర్ క్రైమ్, హవాలా జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు 13 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఆర్బీఎల్ బ్రాంచ్ మేనేజర్ సహా పలువురు ఉద్యోగులు ఉన్నారు.

13 మంది నిందితులు అరెస్టు : మొత్తం 7 మ్యూల్ ఖాతాల ద్వారా రూ.137 కోట్ల లావాదేవీలు జరిపినట్లు దర్యాప్తులో తేలింది. చైనా వ్యక్తులతో కలిసి బండారి సాయిరామ్ అనే వ్యక్తి మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రతి లావాదేవీపై సాయిరామ్ 2 శాతం కమీషన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తం 8 కేసుల్లో 13 మంది నిందితులు అరెస్టు చేశామని కరీంనగర్ సీపీ గౌస్ ఆలం తెలిపారు. ఈ కేసులో డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా నిందితులుగా ఉన్నారని వెల్లడించారు. అమాయకులను, చదువుకున్నవాళ్లనూ, నిరక్షరాస్యులను వాడుకుని ఈ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మధ్యవర్తులు డబ్బుల ఆశతో కొందరు వ్యక్తులను ఖాతాలు ఇవ్వటానికి ప్రోత్సహించారని పేర్కొన్నారు. ఇద్దరు ఆర్బీఎల్ బ్యాంకు ఉద్యోగుల పైనా విచారణ చేపట్టామన్నారు. సైబర్ నేరాల బారిన పడిన వెంటనే 1930కి సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు సూచించారు.

సైబర్ మోసగాళ్ల చేతిలో పావులుగా సామాన్యులు : ఇటీవల కాలంలో సైబర్ మాయగాళ్లు రెచ్చిపోతున్నారు. తాము చేసే నేరాల కోసం అమాయకులను పావులుగా వాడుకుంటున్నారు. తాము బెట్టింగ్, మత్తుపదార్థాల రవాణా, చోరీ ఇలా పలుమార్గాల ద్వారా సంపాదించిన సొమ్మును పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు మ్యూల్ అకౌంట్లకు బదిలీ చేస్తున్నారు. ఆ ఖాతాల ద్వారా ఇతర అకౌంట్లలోకి ట్రాన్స్‌ఫర్ చేయడం వల్ల అమాయకులు బలవుతున్నారు. ఇలాంటి మోసాలకు పాల్పడేందుకు వారు కొంతమంది బ్యాంకు సిబ్బంది కూడా సహకరిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తేలుతోంది. కొంతమంది కమీషన్లకు కక్కుర్తి పడి సైబర్ మాయగాళ్లతో చేతులు కలుపుతున్నారు. తీరా చివరకు ఆర్థిక నేరాల్లో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

కమీషన్ కోసం ఆశపడితే చిక్కులే : కమీషన్ డబ్బులు వస్తాయని ఆశపడి కొంతమంది పాన్, ఆధార్ కార్డులు ఆర్థిక నేరగాళ్లకు సమర్పిస్తున్నారు. వీటిని సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేస్తూ తమ స్వలాభానికి వాడుకుంటున్నారు. ఇటీవలే కొంతమంది యువకుల ఖాతాలకు సైబర్ నేరగాళ్లు నగదు పంపించడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఖాతాదారులు డిజిటల్ చెల్లింపుల సమయంలో చాలా జాగ్రత్తంగా వ్యవహరించాలని పోలీసులు సూచిస్తున్నారు. అపరిచిత వ్యక్తుల అకౌంట్ల నుంచి లావాదేవీలు జరిపితే కేసుల్లో చిక్కుకునే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో అంగరంగ వైభవంగా

# సీతారాముల కళ్యాణ మహోత్సవాలు




కాటేదాన్ లో జరిగిన శ్రీ సీతా రాముల కళ్యాణం లో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్..




లక్ష్మీ గూడ లో జరిగిన సీతారాముల కళ్యాణం లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



అత్తాపూర్ లో జరిగిన సీతారాముల కళ్యాణం లో పాల్గొన్న బి ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి





రాజేంద్రనగర్ హరి హర క్షేత్రం లో జరిగిన శ్రీ రామ నవమి వేడుకలలో పాల్గొన్న భక్తులు




ప్రేమావతిపేట లో జరిగిన సీతారాముల కళ్యాణం లో పాల్గొన్న బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పొన్నమోని మల్లేష్ యాదవ్ కుటుంబ సభ్యులు



శ్రీ సీతా రాముల ఉత్సవ విగ్రహాలను దేవాలయం కు తీసుకువెళ్తున్న బి ఆర్ ఎస్ నాయకులు అక్కెం రాఘవేందర్ యాదవ్ కుటుంబ సభ్యులు






**బుద్వేల్, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో శుక్రవారం సీతా రామ ల కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీరామ నవమి సందర్భంగా జరిగిన కళ్యాణ మహోత్సవాలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి , రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్స్ పెక్టర్ లు ముత్తు యాదవ్, కె నాగేశ్వర్ రావు, సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి, పి అర్చన జయప్రకాశ్, వివిధ పార్టీల నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి , వనం శ్రీరాంరెడ్డి, శెట్టిగారి నరేందర్, ఎస్ వెంకటేశ్, సోమ శ్రీనివాస్ గుప్తా, వై.శ్రీధర్, వేముల రామక్రిష్ణ, పొన్నమోని మల్లేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



రాంబాగ్ రామాలయం లో తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు లు



శివరాంపల్లి లో పూజలలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్ లు

## 28, 29 తేదీల్లో బీజేపీ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

### బిజెపి కంటెస్టెంట్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్

**శేరిలింగంపల్లి : మార్చి 27, (ప్రభాత ఉదయం )**



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో "పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్" శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బిజెపి కంటెస్టెంట్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ తెలిపారు. మార్చి 28, 29 తేదీలలో మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలోని (కల్వరి టెంపుల్ రోడ్) శ్రీ చైతన్య రెసిడెన్షియల్ కళాశాల ప్రాంగణంలో ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని వెల్లడించారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభులు కె. లక్ష్మణ్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర రెడ్డి ఈ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నట్లు వివరించారు. వీరితో పాటు రంగారెడ్డి అర్బన్ జిల్లా ఇన్చార్జి అలె భాస్కర్, జిల్లా అధ్యక్షులు వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి తదితర ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు. శిక్షణ తరగతులకు ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలని రవికుమార్ యాదవ్ కోరారు. పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు ఈ తరగతులు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికైన ప్రతినిధులు 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకే వేదిక వద్దకు చేరుకోవాలి. నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, మోర్చా ప్రతినిధులు, శక్తి కేంద్ర ఇన్చార్జులు, బూత్ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరై ఈ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు.

## స్వప్రయోజనాల కోసమే అరెకపూడి గాంధీ పార్టీ ఫిరాయింపు

### గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ యూత్ వైస్ ప్రెసిడెంట్: రవి యాదవ్

**శేరిలింగంపల్లి : మార్చి 27, (ప్రభాత ఉదయం)**



కొండాపూర్ లోని మసీదు బండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతున్న గ్రేటర్ హైదరాబాద్ బి ఆర్ ఎస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ రవి యాదవ్


తన రాజకీయ మనుగడతో పాటు తన ఆస్తులను కాపాడుకోవడం కోసమే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారని గ్రేట్ హైదరాబాద్ బీఆర్ఎస్ యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ రవి యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కొండాపూర్ మసీదు బండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ నిన్న అసెంబ్లీ వేదికగా గాంధీ చేసిన వ్యాఖ్యలు ఆయనకే 'సెల్ఫ్ గోల్' లా మారాయని ఎద్దేవా చేశారు. ప్లానింగ్ బీఆర్ఎస్ దే అభివృద్ధి మా హయాంలోనె జరిగిందని చెప్పారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జరిగిన ప్రతి అభివృద్ధి పని వెనుక కేసీఆర్, కేటీఆర్ దూరదృష్టి ఉందని వివరించారు. హెచ్ఆర్డీసీఎల్ ద్వారా 140 మిస్సింగ్ లింక్ రోడ్లను గుర్తించి, వాటికి నిధులు మంజూరు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే నని నిన్నటి గాంధీ మాటలతో ప్లానింగ్, మంజూరి బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని ఆయనే స్వయంగా ఒప్పుకున్నట్లు అయిందన్నారు. కోవిడ్ కష్టకాలంలోనూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆగలేదని అన్నారు. ప్రపంచమే స్తంభించిపోయిన కోవిడ్ సంక్షోభ సమయంలోనూ, ప్రజల కష్టాలను గుర్తించి లింక్ రోడ్ల పనులను పరుగులు పెట్టించిన ఘనత కేసీఆరేదే అన్నారు. నాడు అభివృద్ధిని చూపించి ఓట్లు వేయించుకున్న గాంధీ నేడు అదే అభివృద్ధి క్రెడిట్‌ను కాంగ్రెస్ ఖాతాలో వేయాలని చూడటం హాస్యాస్పదమని దుయ్యబట్టారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క పని కూడా పూర్తి చేయలేకపోయారని, తన ఆస్తులను కబ్జా భూములను కాపాడుకోవడానికే గాంధీ పార్టీ ఫిరాయించారని ప్రజలు చర్చించుకుంటున్నరని చెప్పారు. అభివృద్ధి పేరుతో పార్టీ మారడం ప్రజలను వంచించడమేనని విమర్శించారు. రాబోవు ఎన్నికలలో గాంధీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం జోష్యం చెప్పారు. అవకాశవాద రాజకీయాలకు శేరిలింగంపల్లి గడ్డపై తావులేదని అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ అని గాంధీ నోటితోనే ఒప్పుకున్నారని తెలిపారు. రాబోయే కార్పొరేషన్ తోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో అరెకపూడి గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గ ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు. ఈకార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కేవన్ రాములు, మల్లేష్ ముదిరాజ్, శ్రీకాంత్, శంకర్ గణేష్, రాజు గౌడ్ రహీమ్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు

# చలివేంద్రాలు వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తాయి

### ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి : మార్చి 27, (ప్రభాత ఉదయం)**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టెలికాం నగర్‌లో సత్య సాయి సేవా సమితి గచ్చిబౌలి శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులకు బాటసారులకు స్వయంగా చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా జలదానం మిన్న అన్నారు. సమాజ హితం కోరి వేసవి కాలంలో సత్య సాయి సేవా సమితి వారు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. నగరంలో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్న



గచ్చిబౌలి టెలికాం నగర్‌లో చలివేంద్రం ప్రారంభించిన పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ

నేపథ్యంలో దాహార్తి నివారణకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడపై ఆనందం వ్యక్తి చేశారు. ఎండల వల్ల ప్రజలు వాహనదారులు ఇబ్బంది పడకుండా ఈ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అన్ని దానాల కన్నా నీటి దానం ఎంతో గొప్పదని, ప్రజల దాహాన్ని తీర్చడం గొప్ప కార్యమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సత్య సాయి సేవా సమితి సభ్యుల సేవా నిరతిని ఈ సందర్భంగా గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామస్వామి యాదవ్, సత్య సాయి సేవా సమితి సభ్యులు డాక్టర్ బి.సి. రామన్న, రాహుల్ సాగర్, బి.వి.కె. రావు, కృష్ణ రావు, రామ రావు, సుబ్బారావు, ప్రదీప్, శశి కిరణ్, కృష్ణ కుమార్, దయ సాగర్, దీప్తి, అరుణ, మాధవి లత తోపాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ను మర్యాద పూర్వకంగా కలసిన రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ సభ్యులు

## క్రైస్తవ సమాజానికి ఎల్లవేళలా అండగా ఉంటా

### ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్

**బుద్వేల్, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

క్రైస్తవ సమాజానికి ఎల్లవేళలా అండగా ఉంటానని, ఏ పని ఉన్నా తన దగ్గరకు వచ్చి చేయించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ అన్నారు. నూతనంగా నియమితులైన రాజేంద్రనగర్ పాస్టర్స్ పెలోషిప్ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఉదయం మైలార్దేవుపల్లి లో నివాసం ఉండే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ న్ను మర్యాద పూర్వకంగా కలిసారు. మీ సహకారం ఉండాలని కోరారు. దానికి స్పందించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, ఎలాంటి పని ఉన్నా వచ్చి చేయించుకోవాలన్నారు. అందరు కలసి మెలసి ఉండాలన్నారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ ప్రణీత్ బాబు, కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి పాస్టర్ సోమారం రాజ్ కుమార్ , కమిటీ సభ్యులు పాస్టర్ ఎం విజయ్ కుమార్ , పాస్టర్ యేసు రత్నం, పాస్టర్ గుంటి డానియేల్, పాస్టర్ గోపాల్ నాయక్, బ్రదర్ రాజ్ కుమార్ ఇశ్రాయేల్ తదితరులు ఉన్నారు.



కాటేదాన్ టీఎన్జీఓస్ కాలనీలో కబ్జా కు గురవుతున్న పార్కు స్థలం

## పార్కు స్థలాన్ని కాపాడాలి: వి జైపాల్ రెడ్డి

బుద్వేల్, మార్చి 27 (ప్రభాత ఉదయం అత్తాపూర్ సర్కిల్ కాటేదాన్ టీఎన్ జీవోస్ కాలనీలో గల 1200 గజాల పార్కు స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్న కొందరు వ్యక్తులు ఎవరికి అనుమానం రాకుండ ఆ స్థలంలో మట్టి కుప్పలు పోస్తు పార్కు ఆనవాలు లేకుండ చేస్తున్నారు. పార్కు చుట్టు గతంలో నిర్మించిన ప్రహరీగోడ ను మెల్లిమెల్లిగా ధ్వంసం చేసి పార్కు చుట్టూరా వేసిన స్టీల్ రాడ్లు కనిపించకుండ చేసు బిన్నారు. రూ.4 కోట్ల విలువ చేసే ఈ స్థలాన్ని ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు కాపాడాలని ఏఐటీయుసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి కోరారు. లే అవుట్ లో ఉన్న 1200 గజాల పార్కు స్థలాన్ని కాజేయాలని చూస్తున్న వారిని గుర్తించి వారిపై భూ కబ్జా కేసులు నమోదు చేయాలన్నారు. లేనట్లయితే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు హెచ్చరించారు.

## యువకునిపై కత్తితో దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

**బుద్వేల్, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

పాత కక్షలతో ఓ యువకునిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన అదే ప్రాంతానికి చెందిన వివేక్ మండల్ అనే యువకుణ్ణి మైలార్దేవుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి... లక్ష్మీగూడ వాంబేకాలనీ నివాసి మన్యం కుమారుడు రఘుపతి గురువారం రాత్రి తన ఇంట్లో ఉండగా మాట్లాడుకుందాం రా ని పిలిచి అతనిపై వివేక్ మండల్ కత్తితో దాడి చేశారు. ఈ సంఘటన లో రఘు పతి మెడపై తీవ్ర గాయాలైనాయి. దాడికి పాల్పడిన వివేక్ మండల్(23) అనే యువకుణ్ణి మైలార్దేవపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

## హుక్కా సెంటర్‌పై దాడి ఇద్దరి అరెస్ట్

**బుద్వేల్, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హుక్కా సెంటర్ పై గురువారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అత్త పూర్ పిల్లర్ నెంబర్ 133 వద్ద ఎలాంటి అనుమతులు లేకుండ రాజు యాదవ్, వసీం అనే ఇద్దరు యువకులు హైప్స్ అండ్ ఫైప్స్ పేరుతో హుక్రా సెంటర్ ను నిర్వహిసు న్నారు. పోలీసులు దాడులు నిర్వహించి హుక్కా కు సంబందించిన సామాగ్రిని సీజ్ చేశారు. రాజు యాదవ్, వసీం లపై కేసులు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విదంగా ఎవరు ప్రయత్నించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తొమ్మిది మంది పేకాట రాయుళ్ల అరెస్ట్


**బుద్వేల్, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

బాబుల్రెడ్డినగర్ లో శుక్రవారం ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో మైలార్దేవుపల్లి ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి తన బృందంతో దాడి చేసి 9మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.42,460 ల నగదు, ఎనిమిది సెల్ఫోన్లు, రెండు సెట్ల ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. బాబుల్రెడ్డినగర్ పరిసర కాలనీలకు చెందిన ప్రయాగ్ సింగ్(41), సాగర్ గోపి(44), మహేందర్ కుమార్ ( 40), పింటు దేబ్ నాథ్ (52), దూరుప్ సింగ్ (38), షేక్ మన్సూర్ అలీ (38), ధర్మేంధ్ర (32), గోవింద్ గౌతమ్ (33), అజయ్ ప్రమాణిక (36)లను అరెస్ట్ చేశారు.

# గద్వాల జిల్లాలో కనుల పండుగగా శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం


## కళ్యాణ్ ఉత్సవంలో పాల్గొన్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి





గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 27 (ప్రభాత ఉదయం)

శ్రీరామనవమిని పురస్కరించుకుని గద్వాల పట్టణం నది అగ్రహారం రోడ్డులో గల స్వయంభూ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం దేదీప్యమానంగా సాగింది. ముందుగా శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కళ్యాణ వేడుకల మహోత్సవ సందర్భంగా రాములవారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల సీఐ టంగుటూరి శ్రీను దంపతులు, పట్టణఎస్ఐ 2 సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు,అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.



## నదీఅగ్రహారం శ్రీరామావదూత మఠంలో అత్యంత వైభవంగా జరిగిన స్వామివారి కల్యాణం మహోత్సవం

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 27(ప్రభాత ఉదయం)

శ్రీరామ నవమిని పురస్కరించుకొని గద్వాల పట్టణం నదీఅగ్రహారంలో గల శ్రీరామావదూత మఠంలో శ్రీసీతారాముల కళ్యాణ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో శ్రీరాముని యొక్క కళ్యాణము వేద పండితుల వేదమంత్రాల మధ్య అంగరంగ వైభవంగా అశేష జనవాహిని మధ్య శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అద్భుతంగా జరిగింది. అనంతరం భక్తులకు పానకంతో పాటు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ పురేందర్ కుమార్, వార్డు కౌన్సిలర్, నదీ అగ్రహారం పెద్దలు, మహిళలు యువకులు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..





## గద్వాల యువకుడి సేవా స్ఫూర్తికి విశిష్ట గౌరవం

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 27(ప్రభాత ఉదయం)

సమాజానికి సేవ చేయాలనే తపన, రక్తదానం ద్వారా అనేక ప్రాణాలను కాపాడాలనే మహోన్నత లక్ష్యంతో ముందుకు సాగుతున్న గద్వాల యువకుడు ధరూర్ రవి మరో గొప్ప గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ జన్మదిన వేడుకల సందర్భంగా శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు విశిష్ట రక్తదాత పురస్కారం లభించడం విశేషం.జోగులాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండల కేంద్రానికి చెందిన రవి, నిరంతరం రక్తదానం చేస్తూ అవసరమైన వారికి సహాయం అందిస్తూ నిజమైన సేవామూర్తిగా నిలిచారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన నిర్వాహకులు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందజేసి సత్కరించారు.ఈ పురస్కారాన్ని మెగాస్టార్ చిరంజీవి కుమార్తె, సినీ నిర్మాత సుస్మిత, అలాగే మాధవి, నటి నీహారిక చేతుల మీదుగా అందుకోవడం ధరూర్ రవి కి మరింత గౌరవాన్ని తీసుకువచ్చింది.స్వచ్ఛంద రక్తదాన సేవా కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా మెగా పవర్ స్టార్ జన్మదిన సందర్భంగా చిరంజీవి ఐడబ్లడ్ బ్యాంక్ మెగాస్టార్ చిరంజీవి ఆల్ ఇండియా ఫ్యాన్స్ అసోసియేషన్ స్వామి నాయుడు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్తమ విశిష్ట రక్తదాత గా సిని ప్రొడ్యూసర్ చిరంజీవి కుమార్తె సుస్మిత చేతులమీదుగా పురస్కారాన్ని అందుకోవడం జరిగింది.సమాజంలో మానవత్వాన్ని ప్రతిబింబించే రవిలాంటి యువకులు ఉండటం గద్వాల జిల్లాకు గర్వకారణం. యువతకు ఆదర్శంగా నిలుస్తూ సేవాస్ఫూర్తిని చాటుతున్న రవి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు అభినందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా మెగాస్టార్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జమన్న,రాఘు,మహేష్ నాయుడు,శాంతన్న,వెంకటేష్ తదితరులు ఉన్నారు

# రామకృష్ణాపురం గ్రామంలో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం





కొత్తకోట, మార్చి 27(ప్రభాత ఉదయం)

మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజారి రుమాండ్ల పరమేష్ నేతృత్వంలో కళ్యాణ మహోత్సవం కనుల పండుగ జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో గ్రామ సర్పంచ్ , వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, భక్తులు, గ్రామ మహిళలు యువకులు ,గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణం తిలకించారు.



## ఉత్సాహంగా సందె రాళ్ల పోటీలు

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 27 (ప్రభాత ఉదయం)

శ్రీ రామనవమిని పురస్కరించుకుని ధరూర్ మండలం పార్చర్ల గ్రామంలో గ్రామ కమి టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సందె రాళ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీ లకు వివిధ గ్రామాలకు చెందిన యువకులు 91,, 96 కేజీల/సందె రాళ్లు ఎత్తే పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి కావలి బస్వరాజ్ 96 కేజీల బరువు, రూ.4000 నగదు రెండవ బహుమతి 91 కేజిలు రాజు గెలుపొందారు. విజేతలకు గ్రామపెద్దలు నగదు బహుమతులు అందజేశి సన్మానించారు.





## కోతుల గిద్దలో కనుల పండువగా సీతారాముల కల్యాణ మహోత్సవం

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 27 ( ప్రభాత ఉదయం)

శ్రీరామ నవమిని పురస్కరించుకొని ధరూర్ మండలంలో శుక్రవారం సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముహూర్త సమయానికి ఉత్సవమూర్తులను కల్యాణ మండపానికి తీసుకొచ్చి మంగళ వాయిద్యాల నడుమ , వేద పండితుల మంత్రోచనాలు మధ్య శ్రీ సీతారాముల తలంబ్రాలను కన్నుల పండుగగా నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని కోతులగిద్ద గ్రామంలోగల శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీసీతారాముల కళ్యాణ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో శ్రీరాముని యొక్క కళ్యాణము వేద పండితుల వేదమంత్రాల మధ్య అంగరంగ వైభవంగా అశేష జనవాహిని మధ్య శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అద్భుతంగా జరిగింది. అనంతరం భక్తులకు పానకంతో పాటు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోవిందమ్మ, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, మహిళలు యువకులు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## రాంనగర్ రామాలయంలోని శ్రీ శ్రీ శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బి.యస్.కేశవ్

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 27 (ప్రభాత ఉదయం)



ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలోని శ్రీ రామాలయం దేవస్థానం నందు శ్రీ శ్రీ శ్రీ సీతారామల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో బి.యస్.కేశవ్ హాజరై సీతరాముల వారికీ ప్రత్యేక పూజ కార్యక్రమాలు మహా మంగళహారతి నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. తదితనంతరం తీర్ద ప్రసాదాలు స్వీకరించి తమ మొక్కులను చెల్లించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గద్వాల ప్రజలు అందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ గోపాల్ మోహన్ యాదవ్ కమ్మరిసునీత రాము బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోటేష్ , భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## కూకట్‌పల్లి నియోజకవర్గంలో వాడవాడల ఘనంగా శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ వేడుకలు

### కళ్యాణం లో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్న టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

కూకట్ పల్లి, మార్చి 27 (ప్రభాత ఉదయం)

శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణం వాడవాడలా ఘనంగా జరిగింది. కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని కూకట్ పల్లి, భరత్ నగర్, బాలానగర్, బేగంపేట, బోయినపల్లి, అల్లాపూర్, వివేకానంద నగర్, మోతి నగర్, తదితరప్రాంతాల్లో జరిగిన స్వామివారి కళ్యాణం కనుల పండుగ జరిగింది. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వామివారి కల్యాణంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నో లక్షల సంవత్సరాల తర్వాత కూడా రాజ్య పాలనకు శ్రీరామరాజ్యాన్ని కొలమానంగా తీసుకోవడం ఆయన పరిపాలనా గొప్పతనాన్ని తెలియజేస్తుందన్నారు. పాలనలో నేటికీ ఆయన ఆదర్శ పురుషుడిగా విలసిల్లుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, సేవ్ దళ్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# పాలకుర్తి వెలుగు (బాలికల) పాఠశాల ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్


వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉన్నతంగా రాణించాలి**

**మధ్యాహ్న భోజనంపై సమగ్ర పరిశీలన**

**వంట, ఉడికింపు విధానాలపై ఆదేశాలు**

**పప్పులు, ఉల్లిగడ్డలు సహా ఇతర సరుకుల నాణ్యత తనిఖీ**

**పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షల సన్నద్ధతపై ఆరా**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 27(ప్రభాత ఉదయం):**

జిల్లాలోని పాలకుర్తి మండల కేంద్రం పరిధిలో గల సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ వెలుగు (బాలికల) పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి, చదువులో ఉన్నతంగా రాణించాలని జిల్లా కలెక్టర్ ఆకాక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కిచెన్ (వంటశాల)ను, భోజనశాలను ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై కలెక్టర్ సమగ్ర తనిఖీ నిర్వహించారు. వంట చేసే విధానం, ఆహారం ఉడికించే విధానం, ఉపయోగిస్తున్న బియ్యాన్ని, పప్పులు, ఉల్లిగడ్డలు, తదితర సరుకుల నాణ్యతను పర్యవేక్షించారు. వంటశాలలో పరిశుభ్రత (క్లీన్లైనెస్)పై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అన్ని పాత్రలు, వంట గది పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆహారం తయారీలో కూడా నాణ్యతాప్రమాణాలు పాటించాలని, విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని ఆదేశించారు. ఆహారం రుచిగా, శుభ్రంగా, సమయానికి అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని అత్యంత జాగ్రత్తగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు (అటెండెన్స్) వివరాలను పరిశీలించారు. ఈ మేరకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన కుకింగ్ సిబ్బంది పనితీరును కూడా పరిశీలించి, పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. రేపటి పరీక్షల నేపథ్యంలో వారు ఎలా సిద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదువుకుంటూ, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై, మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని, పునశ్చరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ తనిఖీలో ప్రిన్సిపల్ స్వరూప, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## వివాదాల నడుమ


# తహసీల్దార్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం

**ఇరు వర్గాలను పక్కన పెట్టిన అధికారులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 27(ప్రభాత ఉదయం)**

మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామంలో శ్రీరామనవమి పురస్కరించుకుని నిర్వహించాల్సిన శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం గురువారం రాజకీయ రంగు పులుముకుంది. గురువారం కల్యాణోత్సవాన్నీ మేమే నిర్వహిస్తామని ప్రస్తుత సర్పంచ్ మరియు మాజీ సర్పంచ్ వర్గీయుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. దీంతో ఒకరిపైనొక్కరు అధికారులకు ఫిర్యాదు చేసుకోవడంతో గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవ నిర్వహణలో పైచేయి సాధించేందుకు ఇరువర్గాలు పట్టుబట్టడంతో, భక్తుల మనోభావాలను మరియు శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. వివాదానికి కారణమైన ఇరు వర్గాలను పక్కన పెట్టి, నేరుగా ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలోనే కల్యాణాన్ని నిర్వహించాలని జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయించారు. శుక్రవారం శ్రీరామనవమి పురస్కరించుకుని పెద్దపల్లి గ్రామంలో శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో మల్దకల్ తహసీల్దార్ ఝాన్సీ దంపతులు స్వయంగా ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించి శ్రీ సీతారాముల స్వామి వారి కల్యాణోత్స. కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మల్దకల్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజకీయాలకు తావులేకుండా కేవలం భక్తిశ్రద్ధలతో ఉత్సవం నిర్వహించడం పట్ల సాధారణ భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఆలయ పూజారులు మరియు గ్రామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాల్లో జిల్లా గణేష్ నేత... భక్తులతో కలిసి అన్నదానం

**కూకట్ పల్లి, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ కాలనీ, శంశిగూడ ప్రాంతం భక్తి భావంతో కళకళలాడింది. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల సందర్భంగా పలు దేవాలయాల్లో భక్తుల సందడి నిండింది. ఈ పవిత్ర కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ నేత కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దత్తాత్రేయ కాలనీ, ఉజ్జయిని మహంకాళి నగర్, ఆశానగర్, ఎం.టి.ఆర్ నగర్, శివమ్మ కాలనీ పరిధిలోని పలు దేవాలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో ఆయన భక్తులతో కలిసి పాల్గొన్నారు. భక్తి, శ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమాల్లో ప్రాంతీయ ప్రజలు భారీగా హాజరై శ్రీ సీతారాముల ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ, శ్రీరామ నవమి పర్వదినం ప్రతి ఇంటికి ఆనందం, శాంతి, ఐశ్వర్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. సమాజంలో సౌహార్దత, ఐక్యత పెంపొందించడానికి ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. తదనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం భక్తి, సేవా భావాలను ప్రతిబింబిస్తూ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



# శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు


**జగద్గిరిగుట్ట సీఐ వెంకటేశం,**

**కూకట్ పల్లి మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ**

**కూకట్ పల్లి, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

శ్రీరామనవమి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజక వర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీ రామాలయంలో శుక్రవారం శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగద్గిరిగిట్ట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశం, కూకట్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిలుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారికి శాలువాతో సత్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం, భక్తులకు శ్రీరాముని ఆశీర్వాదాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ పుణ్యదినాన సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధర్మం నెలకొనాలని కోరుకుంటూ, ప్రజల అభివృద్ధి కోసం తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ గౌడ్, నరేష్ ముదిరాజ్, పొన్నాల నాగరాజు, విజయ్, క్రాంతి, జగన్, బాలరాజు, దీపక్, కృష్ణారెడ్డి, సంపత్, జనార్ధన్, శంకరయ్య, సిద్దయ్య, మున్నాభాయ్, దేవస్థాన కమిటీ సభ్యులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీ రామ నవమి సందర్భంగా రాంబాగ్ రామ మందిరం వద్ద రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు, జర్నలిస్టు లు ఎం బాలసుబ్రమణ్యం, మోసిన్, రమేష్ రెడ్డి, పవన్ భారతి తదితరులు. సీతారాముల కల్యాణం లో ముస్లిమ్ మైనారిటీ కి చెందిన మోసిన్ పాల్గొనడం విశేషం.



# శ్రీరాముడి జీవితం ధర్మం, కర్తవ్యబద్ధత, క్రమశిక్షణ, ఆత్మనిగ్రహం వంటి విలువలకు ప్రతీక

**లోకకల్యాణం కోసం ఎన్నో త్యాగాలకోర్చిన సీతారాముల పవిత్రబంధం అజరామరమైనది.. భవిషత్తు తరాలకు ఆదర్శనీయమైనది**

**పీసీసీ సభ్యులు,టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి, మార్చి 27 (ప్రభాత ఉదయం)**

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లి నియోజకవర్గం ఏ, బి బ్లాక్ లోని పలు దేవాలయాలలో ఏర్పాటు చేసిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో ఆలయ కమిటీల ఆహ్వానల మేరకు పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక కాలనీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సకల జన, లోక సంరక్షణే శ్రీరామనవమి పరమార్థం అని, శ్రీరాముడు సత్యపాలకుడు, ధర్మాచరణ తప్పనివాడు, ఏక పత్నీ వ్రతుడు, సర్వ సద్గుణాలు మూర్తీభవించిన దయహృదయుడు అని అన్నారు. దుష్టశిక్షణ శిష్టరక్షణలో భాగంగా, రాక్షససంహారంతో పాటు రావణసంహారం చేసి, లోకకల్యాణం జరిపించడానికి జనియించింది జానకీదేవి అని, అదేవిధంగా ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడని అన్నారు. మానవుడిగా పుట్టి మాధవుడైన శ్రీరామచంద్రుడి వ్యక్తిత్వాన్ని మించిన మహోజ్వలమైన వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకొన్న సీతాదేవి జీవితంలోని అడుగడుగు ఆదర్శమే. లోక కళ్యాణం కోసం ఎన్నో త్యాగాలకోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా అధ్యక్ష్యులు దీపక్ జాన్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ కార్పొరేటర్ నరేంద్రాచారి, ఏ బ్లాక్ అధ్యక్ష్యులు నాగిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మూర్తి, ఏఎంసి చైర్మన్ పుష్పా రెడ్డి, బేగంపేట్ శ్రీనివాస్ రెడ్డి, రమాదేవి, కుక్కల రమేష్ ముదిరాజ్, వరహాల స్వామి, లక్ష్మణ్ గౌడ్, నరసింహ యాదవ్, మొయినుద్దీన్, రాకేష్, మాట్టే ప్రసన్న, మహేందర్, భరత్, రేష్మా, జ్యోతి, రేణుక, భారతమ్మ, సంధ్య, గుండా జ్యోతి, పులి శివకుమార్ గౌడ్, గోవింద్ గౌడ్, భరత్ వంశీ, వినయ్ ముదిరాజ్, జమీల్, గణేష్, సంజీవ, కనకయ్య, పులి నాగరాజు, సత్యం, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# రక్తదాన శిబిరాని ప్రారంభించిన జనసేన నాయకులు రామ్ తాళ్లూరి, ప్రేమ కుమార్

**కూకట్ పల్లి, మార్చి 27 (ప్రభాత ఉదయం)**


మెగా అభిమానులు సందీప్ దానపాల్, అరవింద్, చెర్రీ ల ఆహ్వానం మేరకు జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ రామ్ తాళ్లూరి, సైబరాబాద్ మున్సిపల్ కో-ఆర్డినేటర్ మువ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై బాలానగర్ లోని మైత్రీ విమల్ థియేటర్ లో జరిగిన మెగా పవర్ స్టార్ రాంచరణ్ 41 వ పుట్టినరోజు సందర్భంగా జరిగిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ ఒక రక్తదానం ద్వారా ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుంది. తలసేమియా, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు వంటి అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరం అని, రక్తదానం చేస్తున యువతను,నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు భోగాది వెంకటేశ్వర రావు, కొల్లా శంకర్, గడ్డం కిషోర్, నాగరాజు, పులగం సుబ్బు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


# కళ్యాణం ... కమనీయం...

## చైతన్య విలాస్ కాలనీ శ్రీ రామాలయంలో వైభవోపేతంగా శ్రీరాముల కళ్యాణం











**రాజేంద్రనగర్, మార్చి27 (ప్రభాత ఉదయం)**

హైందవుల ఆరాధ్య దైవం శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి లోగల చైతన్య విల్లాస్ కాలనీ శ్రీ రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ శ్రీ రామ నవమి వేడుకల అడ్ హక్ కమిటీ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ కేర్ టేకర్ కమిటీ అధ్యక్షులు శాంతి లాల్ జోషి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వేణుగోపాల్,అడ్ హక్ కమిటీ ప్రతినిధులు పద్మశ్రీ,ఆదర్శ శుక్ల, మేకల వనిత రెడ్డి, స్వప్న, బెజవాడ రామలక్ష్మి ల సారథ్యంలో శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛనుల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం జరిగింది. సీతారామలక్ష్మణ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు.కాలనీ పరిసర ప్రాంతాల భక్తులు తరలివచ్చి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భోజనాలు చేశారు. కాలనీ వాసులు


రాజేష్, రామ్మోహన్రావు కళ్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమం పర్యవేక్షణ నిర్వహించారు. యోగ, సాంస్కృతిక నిర్వాహకురాలు కామేశ్వరి నేతృత్వంలో భక్తులకు భక్తి గేయాలు ఆలపించి ఆలరింపజేశారు. కళ్యాణ్ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు, కళ్యాణ్ ఉత్సవానికి సహకరించిన దాతలకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. భక్తి పరవశంతో కళ్యాణోత్సవం తిలకించి మమ్ములను ఆనందింపజేశారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 2 వేల మంది మంది భక్తులు పాల్గొన్నారు.











Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608